ఆజంపుర క్లాక్ టవర్ ప్రారంభం

చాదర్‌ఘాట్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజలను కనువిందు చేసేందుకు రూ.1.83కోట్లతో నిర్మించిన ఆజంపుర క్లాక్ టవర్‌ను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల గురువారం ప్రారంభించారు. వీటితోపాటు ఆజంపుర డివిజన్‌లో సుమారు రూ.3.54కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఆజంపుర క్లాక్ టవర్‌తోపాటు ఆజంపుర ఆర్‌యూబీని ఆహ్లాదకరంగా నిర్మించిన వర్టికల్ గార్డెన్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ మల్లికార్జున్, ఎంఐఎం నాయకులు మోహియుద్దీన్ అబ్రార్, సయ్యద్‌అలీం, అనాస్‌ఖాద్రీ, కైసర్ పాల్గొన్నారు.



డీఈ విష్ణువర్ధన్‌రెడ్డితో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బలాల

విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం

చాదర్‌ఘాట్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నియోజకవర్గంలోని విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన విద్యుత్ సరఫరా కోసం రూ.6కోట్లతో ప్రతిపాదనలు తయారు చేయిస్తున్నట్లు ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. గురువారం ఆయన ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ డివిజన్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడీఈలు శోభన్‌బాబు, వినోద్‌రెడ్డితో పాటు మరో ఏడుగురు ఏఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో కార్పొరేటర్లు మిన్హాజుద్దీన్, సలాం షాహిద్, ఎంఐఎం నాయకులు సైఫుద్దీన్ షఫీ, మోహియుద్దీన్ అబ్రార్ పాల్గొన్నారు.



భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ జయశ్రీరాజు

భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 28(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 8వ వార్డు హైమావతికాలనీలో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీవాసులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడుతున్న అన్ని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ పునఃనిర్మాణ పనులకు భూమి పూజ

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 28(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 4వ వార్డు శాంతినగర్‌కాలనీ సమీపంలోని పోచమ్మ ఆలయ పునఃనిర్మాణ పూజా కార్యక్రమం గురువారం జరిగింది. స్థానిక కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావిజయేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయం వద్ద ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశ స్థాపన, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని అమ్మవారి విగ్రహాన్ని అంజనేయస్వామి ఆలయానికి తరలించారు. ఆలయ నిర్మాణం పూర్తి అయ్యే వరకు అంజనేయస్వామి ఆలయంలో అమ్మవారికి నిత్య పూజలు కొనసాగుతాయన్నారు. 6నెలల్లో ఆలయ నిర్మాణ పనులను పూర్తి చేయనున్నట్లు కౌన్సిలర్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా : శ్రీనివాస్

సైదాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చైర్మన్, పాలకవర్గంతో కలిసి మలక్‌పేట మార్కెట్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని కమిటీ వైస్ చైర్మన్ కొట్ల శ్రీనివాస్ అన్నారు. ఇటీవల మలక్‌పేట మార్కెట్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా లైన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ కోటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ప్రతినిధులు శాలువకప్పి సన్మానించారు. లైన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ యాదయ్యగౌడ్, భరత్‌రాజ్, రామ్మోహన్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు పనులను చేపట్టాలి : కార్పొరేటర్

చంపాపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని పద్మావతికాలనీలో గురువారం కార్పొరేటర్ సుజాతానాయక్ పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్ కాలనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీకి రెండు సంవత్సరాల కిందట మంజూరైన బీటీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ఏఈ మల్లికార్జున్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు పల్లం శ్రీనివాసులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపీరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ఎల్‌బీనగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నారని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.60వేల చెక్కును లింగోజిగూడ డివిజన్ భాగ్యనగర్‌కాలనీకి చెందిన సీవీ అనీల్‌కుమార్‌కు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నదన్నారు. కార్యక్రమంలో భాగ్యనగర్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాము, పలుసం శ్రీధర్‌గౌడ్, కందికంటి శ్రీధర్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉమేష్ పాల్గొన్నారు.

సత్యానగర్‌కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సత్యానగర్‌కాలనీ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన కాలనీలో పర్యటించారు. అంతర్గతదారుల్లో చెత్త, వ్యర్థాలు తరలించకపోవడంతో, జీహెచ్‌ఎంసీ పారిశుధ్య విభాగం అధికారులను, రాంకీ సూపర్‌వైజర్, సిబ్బందిని పిలిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు కూడా వ్యర్థాలను బయట పారబోయవద్దని, వ్యర్థాలను తరలించే రిక్షాల్లోనే వేయాలని సూచించారు. పారిశుధ్య సిబ్బంది కూడా అంతర్గతదారుల్లో ఉండే చెత్తనూ, వ్యర్థాలనూ సత్వరమే తరలించాలన్నారు. కాలనీవాసులు, అధికారులు పాల్గొన్నారు.



ఈశ్వరమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మధుయాష్కీగౌడ్

హయత్‌నగర్‌ను సందర్శించిన మధుయాష్కీగౌడ్

హయత్‌నగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ పాత గ్రామంలో ఇటీవల మృతిచెందిన ఈశ్వరమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించడానికి గురువారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ హయత్‌నగర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఈశ్వరమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం మధుయాష్కీగౌడ్, కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డితో కలిసి జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బోడ భిక్షపతితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సందిగ్ధంలో మలక్‌పేట ఐటీ టవర్

- 13 నెలలుగా ముందుకు సాగని నిర్మాణ పనులు

సైదాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలో 11 ఎకరాల స్థలంలో సుమారు రూ.700 కోట్లతో 16 అంతస్తుల్లో చేపట్టనున్న మెగా ఐటీ టవర్ నిర్మాణం సందిగ్ధంలో పడింది. టవర్ నిర్మాణ పనులకు 2023 అక్టోబరు 2న నాటి ఐటీ మంత్రి కేటీఆర్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీతో కలిసి శంకుస్థాపన చేశారు. మూడేళ్లలో ఐటీ టవర్ నిర్మించి అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. ఈ ఐటీ టవర్‌తో 20,000 నుంచి 25వేల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని వెల్లడించారు. ఇప్పటికి 13నెలలు గడిచినా పనులకు మోక్షం లభించలేదు. బిల్డర్‌తో ప్రభుత్వ ఒప్పందం కుదరకపోవడంతో ఆలస్యం జరుగుతుందని తెలుస్తోంది.



ఐటీ టవర్ ఏర్పాటు ప్రాంతంలో ప్రస్తుత పరిస్థితి



ప్రతిపాదిత ఐటీ టవర్ నమూనా

రూ.700 కోట్లతో 16 అంతస్తులతో ఐటీ టవర్

మలక్‌పేట ప్రభుత్వ గృహ సముదాయం 44.20 ఎకరాలలో ఉంది. ఇందులోని గృహాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఖాళీగా ఉన్నాయి. మొదటి విడతగా 10.35 ఎకరాల స్థలంలో గృహాలను కూల్చివేసి ఐటీ టవర్‌కు కేటాయించారు. తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్(టీఎస్‌ఐఐసీ)కు బాధ్యత అప్పగించారు. మలక్‌పేట పోలీస్‌స్టేషన్ సమీపంలో పీవీఆర్ మాల్ వెనుక ఉన్న రూ.700కోట్లతో 15లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 16 అంతస్తులతో అధునాతన హంగులతో ఐటీ పార్క్ నిర్మాణం జరగనుంది.



శంకుస్థాపన చేస్తున్న కేటీఆర్(ఫైల్)

గోషామహల్ పోలీస్ స్టేడియాన్ని తరలిస్తారా..

గోషామహల్ పోలీస్‌స్టేడియాన్ని మలక్‌పేటలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. గోషామహల్‌లోకి ఉస్మానియా ఆస్పత్రిని తరలిస్తున్న విషయం తెలిసిందే. ఐటీ టవర్ కేటాయించిన స్థలాన్ని అప్పగిస్తారా? లేకుంటే మిగతా స్థలాన్ని కేటాయిస్తారా? సందేహాలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో భాగంగా సోమవారం మలక్‌పేట బీ బ్లాక్‌లోని ప్రభుత్వ గృహాల సముదాయాల స్థలాన్ని రాష్ట్ర డీజీపీ జితేందర్, సీపీ సి.వి. ఆనంద్, సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్, పాటిల్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. పర్యటన వివరాలను అధికారులు గోప్యంగా ఉంచుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఐటీ టవర్ ఏర్పాటుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

26వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : వచ్చే డీఎస్సీలో 26వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ ఆధ్వర్యంలో గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లో నిర్వహించిన నిరుద్యోగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పాఠశాలకు వెళ్లి చూసినా ఉపాధ్యాయులు లేక ఖాళీ కుర్చీలు దర్శనమిస్తుండగా, విద్యాశాఖ అధికారులు మాత్రం టీచర్ పోస్టులు తక్కువగా ఉన్నట్లు తప్పుడు లెక్కలు చూపిస్తుండడం విడ్డూరంగా ఉం దని మండిపడ్డారు. ఇంగ్లీషు, మ్యాథ్స్ టీచర్ పోస్టు లు చాలా ఖాళీగా ఉన్నాయని పలువురు నిరుద్యోగులు తన దృష్టికి తీసుకువచ్చినట్లు ఆయన వెల్లడించారు. పాఠశాలల్లో పీఈటీ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో స్పోర్ట్స్ ఆటలకు తగిన ప్రాధాన్యత ఇచ్చి విద్యార్థుల శారీరకదృఢత్వాన్ని పెంపొందించాలన్నారు. 20 ఏళ్లుగా ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం మూలంగా అవి మూసివేసే దిశలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని సూచించారు. వెంటనే టీచర్ పోస్టులను భర్తీ చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ప్రొఫెసర్ మధు, లక్ష్మీనారాయణ, సి.రాజేందర్, అనంతయ్య, రవియాదవ్, నిఖిల్‌పటేల్ పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య

నిమ్స్‌ను సందర్శించిన ఆరోగ్య శ్రీ సీఈవో

హైదరాబాద్ సిటీ : రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ సీఈవో శివశంకర్ గురువారం నిమ్స్‌ను సందర్శించారు. మెడికల్ అంకాలజీ, నెఫ్రాలజీ వార్డులో రాజీవ్ ఆరోగ్యశ్రీ లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. నిమ్స్ డయాలసిస్ వీడియో మానిటరింగ్ యూనిట్ ద్వారా జిల్లా యూనిట్లలోని డయాలసిస్ రోగులను కలిసి మాట్లాడారు. నిమ్స్ కోఆర్డినేటర్ మహేష్‌బాబు చికిత్స ప్రోటోకాల్‌ల గురించి, రాజీవ్ ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా అడ్మిషన్ల, సంరక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్, జేఈవో ఎంపానెల్‌మెంట్ డాక్టర్ నరేష్, జీఎం ఫీల్డ్ ఆపరేషన్స్ డాక్టర్ రాంబాబుతో పాటు జిల్లా మేనేజర్ పాల్గొన్నారు.

మలక్‌పేట సర్కిల్‌లో 85శాతం సర్వేపూర్తి

ఓల్డ్‌మలక్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఇంటింటా సర్వే మలక్‌పేట సర్కిల్ 6 పరిధిలో 85శాతం పూర్తయినట్లు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మలక్‌పేట సర్కిల్ పరిధిలో మొత్తం 62,450 గృహాలుండగా ఇప్పటి వరకు 53,000 ఇళ్లకు సర్వే పూర్తయిందన్నారు. సర్వే ఈనెల 30 తేదీతో ముగుస్తుందని ఎన్యూమరేటర్లు నిర్దేశించిన తేదీలోగా సర్వే పూర్తిచేయాలని సూచించారు.

సర్కిల్ 6 కార్యాలయం తరలింపు

మలక్‌పేట సర్కిల్ 6 కార్యాలయాన్ని తరలిస్తున్నట్లు డీసీ జయంత్ తెలిపారు. అక్బర్ బాగ్‌లోని బీ బ్లాకులోకి శుక్రవారం తరలించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు సర్కిల్ కార్యాలయం నల్లగొండ క్రాస్ రోడ్డులోని వికలాంగుల పార్కులో కొనసాగింది. ఇక నుంచి అక్బర్‌బాగ్ బీ క్వార్టర్‌లోకి మారనుంది.

పిల్లలకు వారంలోగా సర్టిఫికెట్లు ఇవ్వాలి : కలెక్టర్

హైదరాబాద్ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎన్జీవోస్, శిశువిహార్ సంరక్షణ కేంద్రాల్లోని పిల్లలకు ఆధార్, పుట్టినతేదీ, కులం సర్టిఫికెట్లను వారం రోజుల్లోగా జారీ చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ, జిల్లా సంక్షేమాధికారి, జీహెచ్‌ఎంసీ సీఎంఓ, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్, డీసీపీఓ, స్వచ్ఛంద సంస్థలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, శిశువిహార్ సంరక్షణ కేంద్రంలోని 1500 పిల్లల కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, డీఆర్‌ఓ వెంకటాచారి, జీహెచ్‌ఎంసీ సీఎంఓ డాక్టర్ పద్మజ, డీడబ్ల్యూఓ అక్కేశ్వరరావు, డీసీపీఓ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజేంద్రనాథ్, ఆర్డీఓ సాయిరాం, ఎస్ఈఎం జ్యోతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

కుష్టువ్యాధి గుర్తింపు, నిర్మూలనపై శిక్షణ

ఎల్‌బీనగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వ్యాధి గుర్తింపు ఉద్యమం, ఎల్సీడీసీ కార్యక్రమంపై జిల్లాస్థాయి అధికారులు, వైద్యాధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం సరూర్‌నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ డిసెంబర్ 2 నుంచి 15 వరకు సర్వే జరుగుతుందని అన్నారు. ఆశ కార్యకర్తలు ఇంటింటికీ లెప్రసీ వ్యాధి లక్షణాల కోసం పరీక్షలు చేస్తారన్నారు. అనుమానం ఉన్న వారిని దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ పాపారావు కుష్టువ్యాధి వ్యాప్తి చెందే విధానం, లక్షణాలు, చికిత్స గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. కుష్టువ్యాధి గుర్తింపు ఉద్యమంలో ప్రతీ రోజు సర్వే చేసే విధానం, నివేదిక తయారు చేసే పద్ధతిని జిల్లా పారామెడికల్ అధికారి సులోచన వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు, ఉప వైద్య ఆరోగ్య అధికారులు, వైద్యాధికారులు, లెప్రసీ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ట్రాఫిక్‌పై అవగాహన పెంపొందించుకోవాలి

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్ననాటి నుంచే ట్రాఫిక్‌పై అవగాహన పెంపొందించుకోవాలని పాణినీయ మహావిద్యాలయ ప్రిన్సిపాల్ ఉషారాణి సూచించారు. వీవీనగర్‌లోని పాణినీయ మహావిద్యాలయ పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం రోడ్డు భద్రత అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది విద్యార్థులు రోడ్డు భద్రత కోసం చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ప్లకార్డులతో చైతన్యపురి, వీవీనగర్, కమలానగర్ కాలనీలలో ర్యాలీ చేపట్టారు. హెల్మెట్ ధరించకుండా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల వచ్చే అనర్థాలను వివరిస్తూ విద్యార్థులు రూపొందించిన ప్లకార్డులు ప్రతి ఒక్కరిని ఆలోచింపచేసేలా ఉన్నాయి. విద్యార్థులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

ఫ్రీ క్రెడిట్ కార్డు ఇస్తామంటూ దోపిడీ

- రూ.1,00,450 దోచుకున్న సైబర్ నేరగాళ్లు

కొత్తపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): లైఫ్ టైమ్ ఫ్రీ క్రెడిట్ కార్డు ఇస్తామంటూ సైబర్ నేరగాళ్లు ఓ ప్రైవేటు ఉద్యోగి ఖాతాలోని రూ.1,00,450 దోచుకున్న సంఘటన ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మన్సూరాబాద్ శ్రీనివాసనగర్‌కాలనీలో ఉండే కోటి చంద్రకాంత్(34) ప్రైవేటు ఉద్యోగి. ఈనెల 16న గుర్తు తెలియని వ్యక్తి అతడికి ఫోన్‌చేసి తన పేరు చిరంజీవి అని, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నానని పరిచయం చేసుకున్నాడు. ఆ బ్యాంకు నుంచి ఎలాంటి మాన్యువల్ రుసుములు లేకుండా ఉచితంగా క్రెడిట్ కార్డు ఇస్తున్నామని నమ్మబలికాడు. దీంతో అతడికి చంద్రకాంత్ ఆధార్ కార్డు నంబర్, పాన్ కార్డు తదితర వ్యక్తిగత సమాచారం ఇచ్చాడు. గుర్తు తెలియని వ్యక్తి లింక్ పంపి దాని ద్వారా క్రెడిట్ కార్డు కోసం వాట్సాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో చంద్రకాంత్ మరిన్ని వ్యక్తిగత వివరాలు పంపాడు. ఆ తర్వాత గుర్తు తెలియని వ్యక్తి ఓ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోమన్నాడు. చంద్రకాంత్ అనుమానం వ్యక్తం చేయడంతో అతడు క్రెడిట్ కార్డు ప్రాసెస్ కోసం అంటూ నమ్మించాడు. బ్యాంకు ఖాతాకు లింకైన మొబైల నంబర్ సహా, డెబిట్ కార్డు వివరాలు, ఫోన్‌కు వచ్చిన ఓటీపీ కూడా గుర్తు తెలియని వ్యక్తికి షేర్ చేశాడు. రాత్రి అతడి ఫోన్‌కు పలు మార్లు ఓటీపీలు వచ్చాయి. మొత్తం రూ.1,00,450 తన ఖాతా నుంచి బదిలీ అయ్యాయని గుర్తించాడు. వెంటనే తన డెబిట్ కార్డును బ్లాక్ చేశాడు. బ్యాంకు అధికారుల సూచనతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

తక్కువ ధరకు ఎఫ్‌ఎక్స్ 3కెమెరా అంటూ..

కొత్తపేట : తక్కువ ధరకు ఎఫ్‌ఎక్స్ 3 కెమెరా కొనండి అంటూ ఓ ఫొటోగ్రాఫర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఆన్‌లైన్‌లో రూ.45వేలు దోచుకున్న సంఘటన ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మన్సూరాబాద్ కాస్మోపాలిటన్‌కాలనీలో ఉండే బొడ్డుపల్లి జానకిరాములు (32) ఫొటోగ్రాఫర్. అక్టోబరు 29న గుర్తు తెలియని వ్యక్తి అతడికి కాల్‌చేసి తమ వద్ద ఎఫ్‌ఎక్స్ 3 కెమెరా తక్కువ ధర రూ.75వేలకే అందుబాటులో ఉందన్నాడు. అది నిజమని భావించి కెమెరా పంపమని కోరాడు. మొదట డబ్బు పంపాలని, విదేశాల నుంచి కెమెరాలు షిప్‌లో వస్తున్నాయని నమ్మబలికాడు. జానకిరాములు అతడు పంపిన క్యూఆర్ కోడ్‌కు రూ.20వేలు పంపాడు. గుర్తు తెలియని వ్యక్తి కెమెరా ఉదయం7గంటలకు వస్తుందన్నాడు. రూ.25వేలు పంపమని చెప్పాడు. మిగతా మొత్తం కెమెరా అందిన తర్వాత పంపవచ్చన్నాడు. అతడికి జానకిరాములు రూ.25వేలు పంపాడు. తర్వాత గుర్తు తెలియని వ్యక్తి ఇంకా రూ.10వేలు పంపాలన్నాడు. దీంతో తాను మోసపోయానని గుర్తించాడు. గురువారం అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొత్తపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలోని సాగర్ రింగ్‌రోడ్డు - చింతలకుంట ఫ్లైఓవర్ కింద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాగర్ రింగ్‌రోడ్డు - చింతలకుంట ఫ్లైఓవర్ కింద గుర్తు తెలియని పురుషుడి(40- 45) మృతదేహం పడి ఉందని పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. అతడు యాచకుడై ఉండవచ్చని, అనారోగ్యంతో మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.



ఎల్బీనగర్ చౌరస్తాలో పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ఎల్బీనగర్‌చౌరస్తా వద్ద పూలేకు నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి, కోకన్వీనర్ శ్రీనివాస్‌గుప్తా తదితరులు



హయత్‌నగర్‌లో పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సీపీఐ రాష్ట్ర నాయకుడు రవీంద్రాచారి, శేఖర్‌రెడ్డి



పూలేకు నివాళులర్పిస్తున్న బడంగ్‌పేట్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

మహాత్మా జ్యోతిరావుపూలేకు నివాళి

మన్సూరాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల ప్రజల హక్కుల సాధనకు పోరాడి సాధికారతకు కృషి చేసి వారిలో ఆత్మస్థైర్యం నింపిన మహనీయుడు మహాత్మాజ్యోతిరావు పూలే అని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని గురువారం ఎల్బీనగర్ చౌరస్తా వద్ద గల ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి పూలే : ఉప్పల

మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దే ఆయుధం విద్య ఒక్కటేనని, అలాంటి విద్యని అందిరికీ అందేందుకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని టీపీసీసీ ప్రచారకమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా గురువారం ఎల్బీనగర్ చౌరస్తా వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ సెల్ చైర్మన్ జోగి, కాంగ్రెస్ నాయకులు మహేందర్, భిక్షపతి, సైదులు, మహేష్, శివకుమార్, సాయి, ప్రభాకర్, భాస్కర్‌యాదవ్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో..

ఎల్బీనగర్, హయత్‌నగర్ కూడళ్లలో టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్ కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో..

ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తా వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ వజీర్ ప్రకాశ్‌గౌడ్ విచ్చేసి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మన్సూరాబాద్ అధ్యక్షుడు, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుడ్డ సత్యనారాయణ, వివిధ డివిజన్ల పార్టీ అధ్యక్షులు వేణుగోపాల్‌యాదవ్, శ్రీపాల్‌రెడ్డి, లింగాల కిశోర్‌గౌడ్, కుట్ల నర్సింహయాదవ్, హెచ్‌ఎంసీ డైరెక్టర్లు పాశం అశోక్‌గౌడ్, నేలపాటి రామారావు, నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ హయత్‌నగర్ కమిటీ ఆధ్వర్యంలో..

హయత్‌నగర్ : సీపీఐ హయత్‌నగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం పూలే వర్ధంతిని నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, ఎల్బీనగర్ కార్యదర్శి శేఖర్‌రెడ్డిలు మండల కేంద్రంలోని పూలే విగ్రహానికి పూలమాలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీదేవి, నాయకులు శోభన్, అరుణ్‌కుమార్, సక్రునాయక్, వంశీవర్ధన్‌రెడ్డి, సుజాత, సరిత, అరుణ, యమున, సౌజన్య, నాగరాజు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్‌లో..

రంగారెడ్డి జిల్లా కోర్టులు : పూలే వర్ధంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులు పూలే చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ, సభ్యులు భిక్షపతిగౌడ్, సుధారాణి, భిక్షమయ్య, సదానందం, లక్ష్మీదేవి, సత్యానారాయణరెడ్డి పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో..

సరూర్‌నగర్ : పూలే వర్ధంతి సందర్భంగా గురువారం బీఎస్పీ కార్యకర్తలతో కలిసి బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్, బడంగ్‌పేట్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ నేటితరం నాయకులు సమాజం కోసం పని చేస్తున్నట్టు నటిస్తున్నారని, అందుకే మార్పు రావడం లేదని అన్నారు.



రంగారెడ్డి జిల్లా కోర్టులో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బార్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ, సభ్యులు భిక్షపతి, సదానందం, లక్ష్మీదేవి, భిక్షమయ్య తదితరులు

బాలాపూర్ చౌరస్తాలో..

పూలే వర్ధంతిని పురస్కరించుకుని గురువారం బాలాపూర్ చౌరస్తాలోని పూలే విగ్రహం వద్ద పలువురు కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు కాట్నే పద్మశ్రీ, బావోజు సిద్ధేశ్వరచారి, కుతాడి సుధాకర్, రేణుక, మూర్తి, మహేందర్, అవినాశ్, వెంకట్, భీమ్‌రాజ్ పాల్గొన్నారు.

న్యూ నాగోల్‌లో..

కొత్తపేట : పూలే వర్ధంతి సందర్భంగా గురువారం న్యూ నాగోల్ ఎస్కే డాంగే భవన్‌లో ఆయనకు సీపీఐ సహా, అనుబంధ సంఘాల ప్రతినిధులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ హక్కుల రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, సీపీఐ సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ, ప్రతినిధులు రాములుగౌడ్, కందుల సుధాకర్, కృష్ణ, ఇద్రిస్, శ్రీనివాస్, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు నాగమణి పాల్గొన్నారు.